













ఉగాదికి సర్వం సిద్ధం





సనత్‌నగర్: తెలుగు సంవత్సరాది ఉగాది (విశ్వావసు నామ సంవత్సరం) పర్వదిన వేడుకలకు నగరం సిద్ధమైంది. ఉగాది పండుగ జోష్‌ను ఆస్వాదించేందుకు సిటీజనులు రెడీ అయ్యారు. వేపపువ్వు, మామిడి, చింత పండు, కొత్త బెల్లం, ఉప్పు, కారం వంటి షడ్రుచుల మేళవింపుతో ఉగాది పచ్చడి తయారీకి అవసరమయ్యే పదార్థాలను సమకూర్చుకునే పనిలో పడ్డారు. అమీర్‌పేట్, ఎస్ఆర్‌నగర్, బేగంపేట్, సనత్ నగర్, రాంగోపాల్‌పేట్, మోండా మార్కెట్, బన్సీలాల్‌పేట్, పద్మారావునగర్ ప్రాంతాల్లో అమ్మకాలు జోరందుకున్నాయి. ఉగాది సందర్భంగా ఆలయాలు అందంగా ముస్తాబయ్యాయి. సనత్‌నగర్ హనుమాన్ దేవస్థానం, బల్కంపేట్ ఎల్లమ్మ ఆలయం ఎస్ఆర్‌నగర్ శ్రీవెంకటేశ్వరాలయం, అమీర్‌పేట్ హనుమాన్ దేవస్థానాల్లో ఉగాది ప్రత్యేక పూజలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇక కాలనీ అసోసియేషన్ల ఆధ్వర్యంలో పలు కాలనీల ప్రజలు ఒకచోట చేరి ప్రత్యేకంగా ఉగాది వేడుకల నిర్వహణకు ఏర్పాట్లు జరిగాయి.

హౌసింగ్ సమస్యలు పరిష్కరించాలి

ఎమ్మెల్యే టీ.పద్మారావుగౌడ్

సికింద్రాబాద్: సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని హౌసింగ్ స్కీం కు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ అధికారులను ఆదేశించారు. నియోజకవర్గంలోని హౌసింగ్ స్కీం పై శనివారం సీతాఫలమండీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష సమావేశం నిర్వహించారు. లాలాపేటలో గతంలో నిర్మించిన ఇండ్లు శిథిలావస్థకు చేరుతున్న పరిస్థితిపై పద్మారావు గౌడ్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రమాదకరంగా పరిణమించిన గృహనిర్మాణ ప్రాంగణాల్లో ప్రజలు నివసిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సాయినగర్ నిర్మాణం పనుల్లో జాప్యం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అదే విధంగా మరాఠా బస్తీలో కొత్త ఇళ్లను నిర్మించాలని, దోబీ ఘాట్, సుబాష్ చంద్ర బోస్ నగర్, ఆజాద్ చంద్ర శేఖర్ నగర్‌లలో లబ్ధిదారులకు ఇళ్ళు కేటాయించాలని సూచించారు. హమాలి బస్తీలో వివాదాలు పరిష్కరించాలని, శాస్త్రినగర్, లబ్దిబస్తీల్లో శిథిల స్థితి చేరిన భవనాల పునర్నిర్మాణం చేపట్టాలని ఆదేశించారు. సికింద్రాబాద్ హౌసింగ్ సెల్ ఏఈ క్రాంతి, అధికారులు మల్లికార్జున్, కార్పొరేటర్లు సామల హేమ, లింగాని ప్రసన్న లక్ష్మి, రాసూరి సునీత, కంది శైలజ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల నిరసన దీక్ష

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ అధికారులు జారీ చేసిన ఆందోళనల పై నిషేధాజ్ఞనల సర్క్యులర్‌ను రద్దు చేయాలని ఐక్య విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిరసన దీక్ష చేపట్టారు. శనివారం ఆర్ట్స్ కాలేజీ ఎదుట మండుటెండలో ఏర్పాటు చేసిన నిరసన దీక్ష కార్యక్రమానికి పౌరహక్కుల నేత ప్రొ.గడ్డం లక్ష్మణ్, ఓయూ ప్రొ.లక్ష్మీకాంత్ రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు ఎర్రోళ్ల శ్రీనివాస్, డా.సత్యవతి, కార్పొరేటర్ డా.సామల హేమ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపి మాట్లాడినట్లు జేఏసీ నేత డా.ఎస్.నాగేశ్వర్ రావు తెలిపారు.

విద్యే భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి

బొల్లారం: 'విద్యే భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తి అని.. ప్రతి విద్యార్థి ఉన్నత స్థాయికి ఎదగాలంటే సరైన వనరులు అందించాలి' అని కంటోన్మెంట్ బోర్డ్ నామినేటెడ్ మెంబర్ బానుక నర్మద మల్లికార్జున్ అన్నారు. తిరుమలగిరి, లాల్ బజార్ లోని ప్రభుత్వ బాలికల ప్రాథమిక పాఠశాలలో రాష్ట్రీయ సాక్షరత మిషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పవన్ కుమార్, ప్రశాంత్, మనోహర్, శ్రీధర్ రెడ్డి, మంజుల, శ్రీకాంత్, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సందడి చేసిన విద్యార్థులు



విద్యార్థులకు జ్ఞాపికలు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రెవరెండ్ ఆంథోనీ వినయ్

రాంగోపాల్‌పేట్: విభిన్న రకాల డ్యాన్సులు, నాటికలు, సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు సికింద్రాబాద్‌లోని సెయింట్ మేరీస్‌డిగ్రీ కాలేజ్ విద్యార్థులు. శనివారం కళాశాల ఆవరణలో ద్వితీయ సంవత్సరం విద్యార్థులు తృతీయ సంవత్సర విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలోని విద్యార్థులతో, ఉపాధ్యాయులతో నెలకొన్న అనుబంధాన్ని విద్యార్థులు గుర్తు చేసికున్నారు. ప్రిన్సిపాల్ రెవరెండ్ డాక్టర్ ఆంథోనీ వినయ్ మాట్లాడుతూ విద్యార్థులు తమ సమయాన్ని సద్వినియోగం చేసికుంటూ క్రమశిక్షణ, అంకితభావంతో ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.

పార్కులో ఐరన్ పోల్స్ చోరీ

చిలకలగూడ: చిలకలగూడ జీహెచ్ఎంసీ పార్కులోని విలువైన ఐరన్ పోల్స్ మాయమయ్యాయి. శుక్రవారం రాత్రి 11 గంటల సమయంలో ఇద్దరు అగంతకులు పార్కులోకి ప్రవేశించి, తాము జీహెచ్ఎంసీ నుంచి వచ్చామని, ఐరన్ పోల్స్ తెమ్మని అధికారులు ఆదేశించారని వాచ్‌మెన్‌కు చెప్పారు. వాచ్‌మెన్ రూమ్ నుంచి కరెంట్ తీసుకుని కటింగ్ మెషిన్‌తో మూడు ఐరెన్ పోల్స్‌ను కట్ చేసి తమవెంట తీసుకు వెళ్లారు. పార్కు వాకర్స్ డెవలప్‌మెంట్ అండ్ వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు శనివారం ఉదయం గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని చిలకలగూడ ఇన్‌స్పెక్టర్ అనుదీప్ తెలిపారు.

క్రీడా మైదానాల అభివృద్ధికి రూ.24 కోట్లు



క్రీడాకారులతో ఎమ్మెల్యే శ్రీగణేష్

రసూల్‌పురా: కంటోన్మెంట్ ప్రాంతంలో క్రీడా మైదానాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం 24 కోట్లు మంజూరు చేసిందని ఎమ్మెల్యే శ్రీగణేష్ పేర్కొన్నారు. శనివారం ఏవోసీ సెంటర్ థాపర్ స్టేడియంలో కార్ఖాన పోలీస్, కంటోన్మెంట్ మీడియా జట్ల మధ్య జరిగిన 20–20 క్రికెట్ మ్యాచ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కంటోన్మెంట్ ప్రాంతంలో క్రీడల అభివృద్ధికి తన వంతు సహకారం అందజేస్తానని హామీచ్చారు. తిరుమలగిరి ఏసీపీ రమేష్, బోయిన్‌పల్లి మార్కెట్ మాజీ చైర్మన్ టిఎన్. శ్రీనివాస్, మాజీ డైరక్టర్ డి. శ్రీనివాస్, కార్ఖాన ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు, రేపు ఆస్తి పన్ను చెల్లించవచ్చు

సనత్‌నగర్: ఆస్తిపన్ను బకాయిదారులు పండగ రోజులైన ఆది, సోమవారాల్లో కూడా ఆస్తి పన్ను చెల్లించే వెసులుబాటు కల్పించినట్లు బేగంపేట సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సమ్మయ్య తెలిపారు. ఈ నెల 30న (ఉగాది), 31న (రంజాన్) రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ కార్యాలయంలోని సిటిజన్ సర్వీస్ సెంటర్ తెరిచి ఉంటుందని, ఆస్తి పన్ను బకాయిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తెలపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గానికి చెందిన 60 మందికి మంజూరైన రూ.25 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కులను సీతాఫలమండి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ శనివారం అందజేశారు. బీఆర్ఎస్ నాయకులు కరాటే రాజు, గరికపోగుల చంద్రశేఖర్, లింగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

రాజ్యాంగ పరిరక్షణకే సంవిధాన్ సమావేశాలు

సికింద్రాబాద్: రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరాన్ని ప్రజలకు వివరించడానికే జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ పేరిట సమావేశాలను నిర్వహిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ నియోజకవర్గ ఇంచార్జ్ ఆదం సంతోష్ కుమార్ తెలిపారు. బౌద్ధనగర్, సీతాఫల్‌మండి డివిజన్లలో సన్నాహక సమావేశాలు శనివారం జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన సంతోష్ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడటానికి, పోరాడటానికి ప్రతిజ్ఞ చేయడం తప్పనిసరన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

బౌద్ధనగర్: అన్ని రంగాలలో తమ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని వీరభద్రీయ కుల సంఘం సభ్యులు కోరారు. శనివారం పార్శీగుట్టకు చెందిన వీరభద్రియ కుల సంఘం అధ్యక్షులు మిట్టపల్లి బాబురావు నేతృత్వంలో రాష్ట్ర బీసీ ఫైనాన్స్ కార్పోరేషన్ చైర్మన్ నూతి శ్రీకాంత్‌ను బీసీ భవన్‌లోని కార్యాలయంలో కలిసి తమ సమస్యలకు సంబంధించిన వినతి పత్రం అందజేశారు.

రాజ్యాంగ పరిరక్షణే కాంగ్రెస్ లక్ష్యం

బొల్లారం: భాజపా ప్రభుత్వం రాజ్యాంగ వ్యతిరేక విధానాలతో ప్రజలను మోసం చేస్తోందని, దీనిపై వాస్తవాలను ప్రజలకు చెప్పేందుకే 'జై బాపు – జై భీం – జై సంవిధాన్' అభియాన్‌స్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే శ్రీగణేష్ తెలిపారు. తిరుమలగిరిలోని జయలక్ష్మీ గార్డెన్‌లో నియోజకవర్గ కోఆర్డినేటర్, రాష్ట్ర ఆర్య వైశ్య కార్పొరేషన్ చైర్‌పర్సన్ కల్వ సుజాత సమక్షంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుల, మత రాజకీయాలతో దేశాన్ని విడదీసే ప్రయత్నాలు చేస్తున్న బీజేపీ మాయలో పడకుండా కాంగ్రెస్ సిద్ధాంతాలను ప్రజల్లోకి విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు.

బోలక్‌పూర్‌లో పౌర హక్కుల దినోత్సవం

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్ బోలక్‌పూర్ ఎవర్‌గ్రీన్ ఫ్రెండ్స్ అసోసియేషన్ కమ్యూనిటీహాల్‌లో శనివారం పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ తహసీల్దార్ పాండు నాయక్, గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్ డి. రాజు, ఎస్సీ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి. సుదర్శన్‌బాబు, మానవ హక్కుల సంఘం తెలంగాణ అధ్యక్షురాలు కృష్ణవేణి స్టాలిన్ తదితరులు హాజరైనారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో తహసీల్దార్ పాండు నాయక్ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కుల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు.

ఓయూ వార్షిక బడ్జెట్ రూ.815.69 కోట్లు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ వార్షిక బడ్జెట్‌ను ప్రవేశ పెట్టారు. శనివారం పాలన భవంలో జరిగిన 2025–26 విద్యా సంవత్సరం అంచన వార్షిక బడ్జెట్‌ను రూ.815.69 కోట్లుగా ప్రవేశ పెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన బ్లాక్ గ్రాంట్స్ నిధులు రూ.546.68 కోట్లతో పాటు వివిధ మార్గాల ద్వారా రూ.772.54 రాబడిని సూచించగా రూ.43.15 కోట్ల లోటును చూచించారు.

రైల్వే కాంట్రాక్టర్ ఆత్మహత్య

సికింద్రాబాద్: సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ రైల్వే కాంట్రాక్టర్ శనివారం ఆత్యహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు.. నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం మామిడాల యాపలగూడెంకు చెందిన వూరుకొండ విజయేందర్‌రెడ్డి (29) రైల్వే ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. మల్కాజిగిరి రైల్వేస్టేషన్‌లో ఇతడికి స్టోర్స్ కోసం ఒక గదిని అధికారులు కేటాయించారు. నల్గొండ నుంచి ఇక్కడికి పనుల మీద వచ్చివెళ్లే విజయేందర్‌రెడ్డి స్టోర్స్ గదిలోని ఫ్యాన్ క్లిప్‌కు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విజయేందర్ ఆత్మహత్యను గుర్తించిన అతని సహాయకుడు సంపత్ పోలీసులకు సమాచారం అందించాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు విజయేందర్ ఆత్యహత్యకు గల కారణాలు అన్వేషిస్తున్నారు.

ఎస్ఆర్‌నగర్‌లో ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీ

అమీర్‌పేట: ఎస్ఆర్‌నగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేశారు. శనివారం ఉదయం ఎస్ఆర్‌నగర్ కమ్యూనిటీ హాలు వద్ద చేపట్టిన తనిఖీల్లో మూసాపేటకు చెందిన శ్రీ వాణి వాటర్ సప్లై కేంద్రానికి చెందిన ట్యాంకర్ నడిపే డ్రైవర్ మాధవరావుకు పరీక్ష చేయగా 181 ఎంజి ఎంఎల్ వచ్చిందని ట్రాఫిక్ పోలీసలు తెలిపారు.దీంతో ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకుని డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థిని అదృశ్యం

చిలకలగూడ: చిలకలగూడ ఠాణా పరిధిలో ఓ విద్యార్థిని అదృశ్యమైంది. ఎస్ఐ ఆంజనేయులు తెలిపిన మేరకు.. చిలకలగూడ మైలార్‌గడ్డకు చెందిన వర్ష (20) సికింద్రాబాద్ మెహబూబ్ కాలేజీలో డిగ్రీ సెకెండ్ ఇయర్ చదువుతోంది. మెహదీపట్నంలోని మెహందీ ఆర్ట్‌వర్క్‌లో పార్ట్‌టైం జాబ్ చేస్తుంది. ఈనెల 24న మెహదీపట్నం వెళ్లిన వర్ష తిరిగి ఇంటికి చేరలేదు. సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. కుటుంబసభ్యులు వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో తండ్రి సంతోష్ శనివారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని పలువురు వక్తలు డిమాండ్ చేశారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో తెలంగాణ విద్యార్థి ఉద్యమకారుల సమావేశం జరిగింది. కార్యక్రమానికి టీవీయూవీ చైర్మన్ కంచర్ల బద్రి అధ్యక్షత వహించగా ఓయూ అధ్యాపకులు డా.రామ్ షఫర్డ్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎల్ మూర్తి, టీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు విజయ్‌నాయక్, ఎంపీ వీరస్వామి, అంసా ఓయూ అధ్యక్షులు నామ సైదులు, ఏఐఎస్ఎఫ్ నేతలు ఉదయ్, భగత్, పీడీఎస్‌యూ నాయకులు మంద నగేష్ తదితరులు ప్రసంగించారు. సంక్షేమ బోర్డును ఏర్పాటు చేసి ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, ఇందిరమ్మ ఇండ్లు, పింఛన్లు, హెల్త్ కార్డులు, స్వయం ఉపాధికి రుణాలు తదితర సౌకర్యాలు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు.

వాహనాలను దహనం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



అమీర్‌పేట: సనత్‌నగర్ కేఎల్ఎన్‌వై మున్సిపల్ పార్కు వద్ద నిలిపి ఉంచిన ద్విచక్ర వాహనాలను గుర్తు తెలియని అగంతకులు నిప్పు పెట్టారు. ఆద్యినగర్ కాలనీ వైపు పార్కు ప్రధాన గేటు వద్ద ఉన్నఖాళీ స్థలంలో సందర్శకుల వాహనాలు పార్కు చేస్తారు. శనివారం సాయంత్రం 6 గంటల సమయంలో పార్కు చేసి ఉన్న వాహనాలకు గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. మంటలు వ్యాపించడాన్ని గమనించిన స్థానికులు మంటలను ఆర్పే ప్రయత్నం చేశారు. అప్పటికే రెండు వాహనాలు దగ్ధమయ్యాయి. మరో 3 వాహనాలు పాక్షికంగా దెబ్బ తిన్నాయి. పోలీసులు సీసీకెమెరాల పుటేజీలను పరిశీలిస్తున్నారు.

చలివేంద్రం ఏర్పాటు

లాలాపేట: తార్నాకలో ఆత్మీయ మహిళా మండలి, ప్రఫుల్ల మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని శనివారం డాక్టర్ లక్కరాజు నిర్మల, నరసింహారావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా మజ్జిగను, తాగు నీటిని పంపిణీ చేశారు. దీంతో పాటుగా ఉగాది వేడుకలను పురస్కరించుకుని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలు అందజేశారు. ప్రత్యూష, ఓం ప్రకాష్, నాగటి చంద్రం, రమ, లత, వీణ, వాణి తదితరులున్నారు.

ఉమేష్‌చంద్రను యువత ఆదర్శంగా తీసుకోవాలి

అమీర్‌పేట్: దివంగత ఐపీఎస్ ఉమేష్‌చంద్రను యువత ఆదర్శంగా తీసుకోవాలని డీజీ మహేష్ భగవత్ అన్నారు. దివంగత ఐపీఎస్ ఉమేష్ చంద్ర జయంతి సందర్భంగా ఎస్ఆర్ నగర్‌లోని ఉమేష్ చంద్ర విగ్రహానికి కు మహేష్ భగవత్ పూలువూల వేసి నివాళులు అర్పించారు. ఉమేష్ చంద్ర మన మధ్యలేకపోయినా ఎప్పుడూ ప్రజల గుండెల్లో ఉంటారన్నారు.

జెక్‌కాలనీలో నేడు ఉగాది వేడుకలు

సనత్‌నగర్: జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది ఉత్సవాలను ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించనున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు మల్లు ప్రసాద్, రాజశేఖర్ చందులు తెలిపారు. అలాగే ఇదే వేదికపై జెక్‌కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ ఫెడరేషన్ ఆవిర్భావ దినోత్సవాలను వైభవంగా జరుపుతున్నట్లు పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు జెక్‌కాలనీ నాలుగో రోడ్డులోని ఆకృతి ప్రెసిడెన్సీ అపార్ట్‌మెంట్ వద్ద ఉత్సవ సభ జరుగుతుందని చెప్పారు. గ్రీన్‌సిటీ అధినేత కొండ్రాజు సుబ్బరాజు ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. వేద పండితులు ఆకెళ్ల వెంకట సుబ్రమణ్యశర్మ పంచాంగ శ్రవణం, అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయన్నారు.

